యూరియా కోసం తప్పని అగచాట్లు

- ఉదయం నుంచే క్యూలు.. మరో వక్క భానుడి భగభగలు
- పోలీసుల పర్యవేక్షణలో రైతులకు యూరియా కట్టలు పంపిణీ



గూడూరు మండలం ఆకులమన్నాడు వద్ద యూరియా కోసం క్యూలో రైతులు

పెడన: యూరియా కోసం రైతులకు అగచాట్లు తప్పలేదు. ఎట్టకేలకు పెడన, గూడూరు మండలాల్లోని పలు పీఏసీఎస్‌లకు, వీటి పరిధిలోని గ్రామాలకు యూరియా కట్టలు రావడంతో శనివారం పంపిణీ ప్రారంభించారు. రైతులు ఉదయం నుంచే ఆయా గ్రామాల్లోను, పీఏసీఎస్‌లు వద్ద బారులు తీరారు. పీఏసీఎస్‌లకు సంబంధించిన గ్రామాల్లోను, పీఏసీఎస్ ఉన్న గ్రామాల వారికి మాత్రమే ఇస్తామని స్పష్టం చేస్తుండటంతో కొంత రద్దీ తగ్గించుకునే ప్రయత్నాలు అధికార యంత్రాంగం చేపట్టింది. శనివారం పెడన మండలంలోని నందమూరు పీఏసీఎస్ పరిధిలో జింజేరు, కాకర్లమూడి, నందమూరు గ్రామాలకు విడివిడిగా యూరియా కట్టలను కేటాయించారు. నందమూరుకు 20 మెట్రిక్‌టన్నులు, జింజేరుకు 15 మెట్రిక్ టన్నులు, కాకర్లమూడికి 5 మెట్రిక్ టన్నులు కేటాయించి ఆయా గ్రామాల్లోనే పంపిణీ చేపట్టారు. గురివిందగుంట సచివాలయం పరిధిలోని కుమ్మరిగుంట, కొంగంచర్లకు పది మెట్రిక్ టన్నులు కేటాయించి అందజేశారు. కవిపురం, గురువిందగుంటకు 15 మెట్రిక్‌టన్నులు రాగా కవిపురం పీఏసీఎస్ వద్ద పంపిణీ చేశారు. ఆదివారం మరికొన్ని గ్రామాల్లో యూరియా కట్టలు అందజేస్తామని, గ్రామాలు వారీగా పంపిణీ చేస్తామని ఏవో జెస్సీ తెలిపారు. ఇదిలా ఉంటే మండుటెండలో రైతులు యూరియా కోసం నిరీక్షించారు. పలుచోట్ల పోలీస్ బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు.

కడుపు మాడ్చుకుని..

చల్లపల్లి: కడుపు మాడ్చుకుని యూరియా కోసం పడిగాపులు పడితే ఒక బస్తా యూరియా చేతిలో పెట్టి సరిపెట్టుకోవాలని చెప్పడంతో రైతులు నిశ్చేష్టులయ్యారు. అరకొర యూరియాతో పంటను ఏరకంగా కాపాడుకోవాలంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళాపురంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)కు శనివారం యూరియా లోడు వస్తుందని తెలుసుకున్న రైతులు ఉదయం నుంచి పడిగాపులు కాశారు. 15టన్నుల యూరియా మంగళాపురం పీఏసీఎస్‌కు వచ్చింది. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి నుంచి రైతులకు టోకెన్లు ఇవ్వడం ప్రారంభించారు. రైతులు మధ్యాహ్నం 2.30 వరకూ చెమటలు కక్కుతూ మండుటెండలోనే క్యూలో నిలుచున్నారు. కొందరు లోపలకు చొరబడటంతో కొంత గందరగోళం జరిగింది.

- యూరియా వచ్చాక అది గ్రోమోర్ కంపెనీ యూరియా అని తమది కాదని పీఏసీఎస్ వారు ఆ లారీని తిప్పి పంపడానికి సిద్ధమయ్యారు. రైతులు ఆగ్రహించి అడ్డుపడ్డారు. మొదటి విడతలో కూడా ఇలాగే చెప్పి అందరూ వెళ్లిపోయిన తర్వాత తమకు కావాల్సిన వారికి యూరియా పంపిణీ చేసుకుని స్టాకు అయిపోయిందని చెప్పి వచ్చినవారిని తిప్పి పంపారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మంగళాపురానికి కావాల్సింది 160 టన్నులు అయితే వచ్చింది 25 టన్నులే కావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, దాన్నే నమ్ముకున్న రైతులను చిన్నచూపు చూడటంతో తమకు ఈ దుస్థితి దాపురించిందని నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచారని తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

బంటుమిల్లి: స్థానిక పీఏసీఎస్‌లో శనివారం యూరియ దిగుమతి కావడంతో తహసీల్దార్ కేవి పూర్ణచంద్రరావు దగ్గర ఉండి రైతులకు పంపిణీ చేయించారు. సొసైటీల పంపిణీలో అవకతవకలు తలెత్తాయని కలెక్టరుకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ పంపిణీలో 17 పంచాయతీలు ఉన్న బంటుమిల్లి పీఏసీఎస్ వద్ద రైతులు గొడవలు చేయడంతో పోలీసువారి సహకారంతో తహసీల్దార్ పూర్ణచంద్రరావు దగ్గర ఉండి యూరియా పంపిణీ చేయించారు.

కొంకేపూడి సచివాలయం వద్ద ..

పెడన: కొంకేపూడి పీఏసీఎస్ వద్ద కాకుండా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద యూరియా కట్టలను అందజేస్తారని సమాచారం రావడంతో రైతులు కొంకేపూడి సచివాలయం వద్ద ఉదయం నుంచి ఎదురుచూడటం ప్రారంభించారు. సాయంత్రం యూరియా ఇచ్చేందుకు సంబంధిత సిబ్బంది సిద్ధమవ్వడంతో ఈదుమూడి, కొంకేపూడి రైతులు బారులు తీరారు. 15 మెట్రిక్ టన్నులు వచ్చాయని ఇస్తామని చెప్పినా గందరగోళం ఏర్పడటంతో 47 మందికి మాత్రమే టోకెన్లు ఇచ్చి యూరియా కట్టలను అందజేశారు. మిగిలిన వారికి రేపు ఇస్తామని చెప్పినా రైతులు వాగ్వాదానికి దిగడంతో పోలీసులు జోక్యం చేసుకుని టోకెన్లు ఇచ్చి పంపించేయాలని, రేపు నంబర్ల ప్రకారం యూరియా ఇస్తామని చెప్పారు. రైతులు రాత్రి ఎనిమిది గంటల వరకు పంచాయతీ కార్యాలయం వద్ద వేచి ఉండి టోకెన్లు తీసుకున్నారు. గూడూరు మండలంలోని ఆకులమన్నాడు పీఏసీఎస్‌లో యూరియా పంపిణీ ప్రక్రియను వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉపసంచాలకులు ఎస్‌సీహెచ్ బాలూనాయక్, కృష్ణాజిల్లా సంయుక్త సంచాలకులు ఎస్.పద్మావతి సందర్శించారు.

ఘంటసాల మండలంలో..

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో పీఏసీఎస్ వద్దకు సుమారుగా 15 టన్నుల యూరియా వచ్చింది. శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, పాపవినాశనం, గోగినేనిపాలెం, అచ్చెంపాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులు, కౌలు రైతులు ఉదయం 6 గంటలకే ఆయా యూరియా పంపిణీ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. వ్యవసాయ శాఖ మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డిలతో కలిసి సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, జనసేన నేతలు యూరియా పంపిణీ ప్రారంభించారు.

శ్రీకాకుళం పీఏసీఎస్ వద్ద శ్రీకాకుళం రైతులకు యూరియా ఇచ్చారు. ప్రైవేటు వ్యాపారి వద్ద అచ్చెంపాలెం, తెలుగురావుపాలెం, పాపవినాశనం, గోగినేనిపాలెం గ్రామాల నుంచి రైతులు అధికారుల నిబంధనల మేరకు ఎకరాకు అరకట్ట చొప్పున 10 ఎకరాల పైన ఎంత పండించినా నాలుగు కట్టల చొప్పున ఇవ్వాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు స్థానికులు తెలిపారు. గుర్తింపు కార్డులను వీపీఏలకు అందించారు. అక్కడ ఒక్కోరకంగా స్లిప్పులు ఇవ్వడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



మంగళాపురం పీఏసీఎస్ వద్ద శనివారం మధ్యాహ్నం 2.10 గంటల సమయంలో యూరియా కోసం బారులు దీరిన రైతులు



శ్రీకాకుళంలోని ప్రైవేటు ఎరువుల షాపు వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు



శ్రీకాకుళం రైతు సేవా కేంద్రం వద్ద స్లిప్పుల కోసం గుమికూడిన రైతులు

క్లుప్తంగా

కంట్రోలర్, మహిళా కండక్టర్ వాగ్వాదం



మచిలీపట్నంటౌన్: బందరు ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో కంట్రోలర్ వడ్డీ నాంచారయ్యకు ఓ మహిళా కండక్టర్ మధ్య శనివారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున వాగ్వాదం చోటు చేసుకుంది. వారి అరుపులతో బస్‌స్టాండ్ ఆవరణ మార్మోగింది. మధ్యాహ్నం 3.30 గంటలకు బస్ సర్వీసును బస్‌స్టాండ్ నుంచి గమ్యానికి బయలుదేరాల్సిన కండక్టర్ అలా చేయకుండా అక్కడే ఉండటంతో కంట్రోలర్ నాంచారయ్య ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికుల మధ్యే వారిద్దరూ వాగ్వాదాలకు దిగారు. దీంతో ప్రయాణికులకు అక్కడ ఏం జరుగుతోందో అర్థం కాక గందరగోళానికి గురయ్యారు. బస్‌స్టాండ్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్‌స్టాండ్‌లో కుక్కల స్వైర విహారం

బెంబేలెత్తుతున్న ప్రయాణికులు



మచిలీపట్నంటౌన్: బందరు బస్‌స్టాండ్‌లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రయాణికులు కూర్చునే బెంచీల వెంట గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయి. ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. బస్‌స్టాండ్లో ప్రతిరోజూ ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులు రావడానికి భయపడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌స్టాండ్‌లో కుక్కలు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని డిపో మేనేజర్ టి.పెద్దిరాజు దృష్టికి 'సాక్షి' తీసికెళ్లగా త్వరలో బస్‌స్టాండ్‌లో కుక్కలు తిరగకుండా చర్యలు తీసుకుంటానన్నారు.

పోషకాహార వారోత్సవాలు

గూడూరు: జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా శనివారం పోసినవారిపాలెం పంచాయతీలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోషకాహార ప్రాముఖ్యాన్ని హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం వివరించారు. ఏఎన్ఎం నాగలక్ష్మి, సీహెచ్ఓ శోభన, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన రోడ్డు ప్రమాదం

కప్తానుపాలెం(మోపిదేవి): పెదప్రోలు శివారు కప్తానుపాలెం 216 జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం త్రుటిలో తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చల్లపల్లి నుంచి మోపిదేవి వైపు వస్తున్న కారును కప్తానుపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ఢీ కొనడంతో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. వెంటనే కారు పక్కకు తీసుకోవడంతో ప్రమాదం తప్పింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

కళ్లేపల్లి ఏడుకొండలుకు సాహితీ సత్కారం



చిలకలపూడి(మచిలీపట్నం): గురు పూజోత్సవంలో సమగ్ర శిక్ష ఏపీఎంగా చేస్తున్న రచయిత కళ్లేపల్లి ఏడుకొండలుకు సాహితీ సత్కారం లభించింది. విజయవాడలోని రామ్మోహన గ్రంథాలయంలో కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఏడుకొండలుకు సాహితీ సత్కారాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి వియన్నారావు, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, జీవీ పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖుడు లక్ష్మీపెరుమాళ్లు మృతి



కోడూరు: ఆర్యవైశ్య ప్రముఖుడు, అన్నం అన్నపూర్ణమ్మ చారిటీస్ వ్యవస్థాపకుడు అన్నం లక్ష్మీపెరుమాళ్లు (90) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి కన్నుమూశారు. అన్నపూర్ణమ్మ చారిటీస్ ద్వారా ఆయన అనేక మంది పేదలకు అన్నదానం, వస్త్రదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం కోడూరుకు వచ్చి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చల్లపల్లి: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతిచెందగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపురం పంచాయతీ శివారు చింతలమడ దళితవాడకు చెందిన నిమ్మగడ్డ హరిప్రసాద్ ఒంటరిగా నివసిస్తున్నాడు. మద్యానికి బానిసైన హరిప్రసాద్ ఆరోగ్యం క్షీణించడంతో గతనెల 25న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు అతన్ని విజయవాడలోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం హరిప్రసాద్ మరణించినట్లు ప్రసాద్ తెలిపారు.

పాత కక్షలతో దాడి

బొబ్బర్లంక(మోపిదేవి): పాత కక్షల నేపథ్యంలో దాడి చేయడంతో వ్యక్తికి తీవ్రగాయమై మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కొక్కిలిగడ్డ గ్రామానికి చెందిన యలమంచిలి సురేష్ పక్కనే ఉన్న బొబ్బర్లంక గ్రామంలో శుక్రవారం రాత్రి పాలు విక్రయించుకుని ఇంటికి తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో మైలా శివకుమార్, పీతా నవీన్‌కుమార్ ఇద్దరూ సురేష్‌తో గొడవపడి దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో సురేష్ చేయి విరగడంతో అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదులను తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శనివారం ఎస్ఐ వివరించారు.

సంకల్ప అవగాహన సదస్సు

ఘంటసాల: సమాజంలో పరిస్థితులపై బాలికలకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న సంకల్ప అవగాహన సదస్సును ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ రుతుక్రమ సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పరిశుభ్రతంగా ఎలా ఉండాలో తెలిపారు. మండలంలోని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో కూడా సదస్సు జరిగింది. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.శ్రీరంగవల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.పద్మ, యు.కోటేశ్వరమ్మ, వై.సునీత, పి.రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలు లేవంటూనే ప్రత్యేక క్యాంపులు

పెడన: విష జ్వరాలు లేవంటూనే పీహెచ్‌సీల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. శనివారం పెడన మండలం చేవేంద్ర పీహెచ్‌సీ పరిధిలోని నందిగామలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ తన సిబ్బందితో శిబిరాన్ని ఏర్పాటు చేయగా 95 మంది గ్రామస్తులు చూపించుకున్నారని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. విషజ్వరాలు ఏమైనా ఉన్నాయా అంటే అటువంటివి ఏమీ లేవని వైద్యసిబ్బంది పేర్కొనడం విశేషం. మరోవైపు జ్వర పీడితులు నిరసించి రావడంతో అక్కడే కూర్చోబెట్టి సిలైన్ బాటిల్స్‌ను పెట్టి కోలుకున్న తర్వాత పంపించారు. విష జ్వరాలు అధికంగా ఉన్నాయనే విషయాన్ని, గ్రామంలో జ్వరపీడితులు ఎందరున్నారనే సమాచారం కోసం చేవేంద్ర పీహెచ్‌సీ వైద్యాధికారిని సంప్రదించడానికి ప్రయత్నించగా ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉంది. కింది స్థాయి సిబ్బంది మాత్రం సమాచారం ఇవ్వడానికి మాకెందుకు అన్నట్లుగా నడుచుకోవడం గమనార్హం.



నందిగామలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్

ఏకరాత్రి ప్రసన్న మల్లికార్జునస్వామి ఆదాయం రూ.1,22,841

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని ఏకరాత్రి ప్రసన్న మల్లికార్జునస్వామి హుండీ ఆదాయం రూ.1,22,841 వచ్చినట్లుఈవో సుధాకరరావు తెలిపారు. దేవస్థానంలో 16 నెలల తర్వాత పర్యవేక్షణాధికారి జె.ప్రవీణ, గ్రామస్తులు, అర్చకుల సమక్షంలో శనివారం హుండీని తెరచి లెక్కించగా రూ.1,22,841 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), కొండవీటి కోటేశ్వరరావు, గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కూటమి పాలనలో రైతులకు కష్టాలు

కోనేరుసెంటర్: చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రతిసారి రాష్ట్రంలో రైతులకు కష్టాలు తప్పటంలేదని బందరు నియోజకవర్గం రైతువిభాగం నార్త్ మండల అధ్యక్షుడు గడిదేశి రాజు మండిపడ్డారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏనాడు రైతులు బాగుపడిందిలేదన్నారు. సౌత్ మండల అధ్యక్షుడు కంచర్లపల్లి విజయసారథి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో సకాలంలో రైతులకు అవసరమైన విత్తనాలు, కావాల్సిన మందులు, యూరియా, పంటలకు అవసరమైన కాలువల నీరు అందవన్నారు. నార్త్ మండల అధ్యక్షుడు మట్టా మోహననాంచారయ్య మాట్లాడుతూ చంద్రబాబు ప్రతిసారి రైతులకు అన్యాయం చేస్తున్నాడంటూ మండిపడ్డాడు. జిల్లా జాయింట్ సెక్రటరీ గణేశన రమేష్ మాట్లాడుతూ యూరియా విషయంలో రైతులు పడుతున్న అవస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావన్నారు. ఈ నెల 9వ తేదీ మచిలీపట్నంలో జరిగే అన్నదాతపోరులో మండల రైతాంగం పాల్గొని నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షాన ప్రభుత్వంపై పోరాడాతారన్నారు. సమావేశంలో నార్త్ మండల ఉపాధ్యక్షుడు మందా బాబురావు, నట్టే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు బ్యాగులు, మ్యాట్‌లు అందజేత

పెడన: లంకలకలువగుంట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు దాత టి.మధుసూదనరావు అందజేసిన మ్యాట్‌లు, బ్యాగులను చిన్నారులకు ఇచ్చారు. తొలుత జరిగిన పౌష్టికాహార వారోత్సవాల్లో అంగన్‌వాడీల ద్వారా అందజేస్తున్న వాటిపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టి.నాగలక్ష్మి, వై. నాగరత్నం, వై.హేమసుందరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాల సందర్భంగా చివరి రోజు శనివారం స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, విజయలక్ష్మి దంపతులు శ్రీకాకుళ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకొన్నారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చింతామణి నాటక ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాజుపేట సాతాను బజారులో చిరంజీవి బొమ్మ సమీపంలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్సవాల పందిరిలో శనివారం రాత్రి చింతామణి నాటక ప్రదర్శన జరిగింది. జబర్దస్త్ నటుడు అప్పారావు బృందం శ్రీ రామ్మోహన నాట్య మండలి ఆధ్వర్యాన ప్రదర్శించిన నాటకం భక్తులను ఆకట్టుకుంది. మంచి సందేశంతో పాటు హాస్యాన్ని పండించారు. నాటకంలో సుబ్బిశెట్టి పాత్రలో అప్పారావు చేసిన హాస్యానికి ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వుకున్నారు. నాటకాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.



నాటకంలో హాస్యాన్ని పండిస్తున్న జబర్దస్త్ అప్పారావు

దోమల నివారణకు ఎబెట్ పిచికారి

తెలుగురావుపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం తెలుగురావుపాలెం పంచాయతీ పరిధిలో సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు ఆధ్వర్యాన దోమల నివారణకు ఎబెట్ మందును శనివారం పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మురుగు నీరు నిల్వ ఉన్న చోట్ల, డ్రైనేజీల వద్ద ఎబెట్ మందును కార్మికులతో చల్లించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.సుధాకర్, హెల్త్ విజిటర్ రత్న కుమారి, సూపర్‌వైజర్ రవి కుమార్, అసిస్టెంట్ ఏడుకొండలు, ఆశా కార్యకర్త మీనారాణి సిబ్బంది పాల్గొన్నారు.



అన్న సమారాధనలు, నిమజ్జనాలు



బందరులో నిమజ్జనానికి భారీ గణనాథుడి విగ్రహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం



పెదప్రోలులో గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బంటుమిల్లి పాత బస్‌స్టాండు సెంటర్‌లో గణనాథుడి గ్రామోత్సవం

పెడన: వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో శనివారం పలు ప్రాంతాల్లో అన్న సమారాధనలు చేశారు. పట్టణంలోని గూడూరు రోడ్డులో బ్రహ్మ ఆటోస్టాండ్ వద్ద, దక్షిణ తెలుగుపాలెంలో భారీ అన్న సమారాధనలు నిర్వహించడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. సాయంత్రం ఆయా ప్రాంతాల్లో గణనాథుడి ప్రతిమలను ఊరేగింపుగా బ్యాండ్ మేళాలతో నృత్యాలు చేసుకుంటూ రామరాజు పంట కాలువలో నిమజ్జనం చేశారు.

మచిలీపట్నంటౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాల నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు శనివారం నగరంలో ఉత్సాహంగా నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లోని విగ్రహాలను పెద్ద ఎత్తున మంగినపూడి బీచ్‌లో, రామరాజుపాలెం కాలువలో నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. డీజే సౌండ్స్‌కు పిన్నా పెద్ద తేడా లేకుండా డ్యాన్సులు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. నగరం నుంచి పదుల సంఖ్యలో గణనాథుని విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లారు.

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులో శనివారం గణనాథుడి విగ్రహాన్ని సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం చేశారు. మేళతాళాలు డప్పుకళాకారులతో స్వామివారిని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

బంటుమిల్లి: బంటుమిల్లిలో గణేష్ నవరాత్రి పూజలు శనివారంతో ముగిశాయి. స్థానిక పాత బస్టాండు సెంటర్లో శ్రీలక్ష్మీగణపతి మోటారు వర్కర్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని బంటుమిల్లి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు. ఎస్ఐ గణేష్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గూడూరు: గంద్రం గ్రామంలో శనివారం కోలాహలంగా వినాయక నిమజ్జనం నిర్వహించారు. సర్పంచ్ గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో గణనాథుడిని ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు శుక్రవారం భారీ అన్నదానం చేశారు. చివరి రోజు శనివారం ప్రత్యేక వాహనంపై బొజ్జ గణపయ్యను పంట కాలువలో నిమజ్జనం చేశారు.

కోడూరు: మండలంలోని యర్రారెడ్డివారిపాలెం, మేరకగౌడపాలెం, వడ్డెరపాలెం గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు ముగించుకొని శనివారం విగ్రహాలను ఉల్లిపాలెం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

తాడేపల్లి(ఘంటసాల): తాడేపల్లిలో శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. తుమ్మల రత్నగిరిరావు కుమారుడు ఎన్నారై కోటేశ్వరరావు, లావణ్య దంపతుల సహకారంతో వేలాదిమందికి అన్నసమారాధన జరిగింది.